రైతుల కష్టం.. దళారుల భోజ్యం

- సిండికేట్‌గా ఏర్పడిన వ్యాపారులు
- మద్దతు ధర కంటే తక్కువకు మొక్కజొన్న దిగుబడుల కొనుగోలు
- ఆందోళనలో అన్నదాతలు

పగిడ్యాల: మొక్కజొన్న దిగుబడి బాగా వచ్చిందని సంబరపడుతున్న అన్నదాత కష్టానికి మధ్య దళారులు, వ్యాపారులు కన్నం వేసి కొల్లగొడుతున్నారు. వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి క్వింటా రూ. 1700 నుంచి రూ. 1800ల ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

1,489 ఎకరాల్లో సాగు

మండల వ్యాప్తంగా రబీ సీజన్‌లో 1,489 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు, పాత, కొత్త ముచ్చుమర్రి, సంకిరేణిపల్లె, బీరవోలు, పగిడ్యాల, పాలమర్రి, లక్ష్మాపురం, తూర్పు, పడమర ప్రాతకోట, ఎం. ఎస్. ఘణపురం, రైతుపల్లె తదితర గ్రామాల్లోని రైతులు కేసీ ఆయకట్టు కింద అత్యధికంగా నీటి మునుకపాలాల్లో మొక్కజొన్న పంటలను వేశారు.ప్రస్తుతం పంట నూర్పిడి పనులు ఊపందుకుని పంట దిగుబడులు ఇళ్లకు తరలిస్తున్నారు.

ఎకరానికి 35 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడి

ఎకరానికి 35 నుంచి 45 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయి. దీంతో దళారులు గ్రామాల్లోకి కొత్త వ్యాపారులను రానివ్వకుండా సిండికేట్ వ్యాపారానికి తెరలేపారు. క్వింటానికి రెండు వందల రూపాయాలు కోత విధించి కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల వేలాది రూపాయాలను నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మార్కెడ్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



మొక్కజొన్నలను సంచులకు నింపుతున్న హమాలీలు

మద్దతు ధర రూ. 1,962

రబీ సీజన్ కింద మండల వ్యాప్తంగా బావులు, బోర్లు, కేసీ ఆయకట్టు కింద 1,489 ఎకరాలలో మొక్కజొన్న పంటను సాగు చేశారు. క్వింటానికి ప్రభుత్వ మద్దతు ధర రూ. 1962లు ఉంది. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ అనుమతులు రాగానే కొనుగోళ్లు చేపడుతాం. – విజయ్‌జ్యోతుకుమార్, ఏఓ, పగిడ్యాల

ధరలు అమాంతం తగ్గించేశారు



ఈ ఏడాది రబీ సీజన్‌లో నీటి మునక పొలంలో మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశా. పంట దిగుబడి బాగానే వచ్చింది. పంటలు చేతికి రాక ముందు క్వింటా మొక్కజొన్నలు రూ. 2200ల ప్రకారం వ్యాపారులు కొనుగోలు చేశారు. అయితే దిగుబడులు ఇళ్లకు రాగానే అమాంతంగా ధరలు తగ్గించారు. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి క్వింటానికి రూ. 450లు కోత విధించి ప్రస్తుతం రూ. 1750ల ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. – సహదేవుడు, నెహ్రూనగర్

వ్యాపారులు దగా చేస్తున్నారు



నీటి మునక భూములు బంగారు పంటలు పండాయి. 20 ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశాను. పంట నూర్పిడి పనులు చేపట్టాం. మొక్కజొన్న దిగుబడులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ ధర మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. ఎకరాకు రూ. 45 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయి. వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి రైతులను దగా చేస్తున్నారు. – నరసింహ, నెహ్రూనగర్

క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు



కుమారస్వామికిపూజలు నిర్వహిస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలశ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం పురస్కరించుకుని ఈఓఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ కేజీ నాయక్

వెలుగోడు: గిరిజనులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐటీడీఏ స్పెషల్ ఆఫీసర్ కేజీ నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక చెంచు కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గిరిజనులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలంటే చదువుతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అటవీ సంపదను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైన ఉందని, అడవికి నిప్పు పెట్టడం వలన వృక్ష సంపదతో పాటు వన్యమృగాలు మృత్యువాత పడతాయని తెలిపారు. చెంచులకు రేషన్ కార్డులు, ఆధార్ కార్డుల గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో షేక్ అమానుల్లా, ఎస్ఎస్‌వో సిబ్బంది పాల్గొన్నారు.

1న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

మిడుతూరు: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల సందర్భంగా మే 1న 6 పండ్ల వృషభరాజుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు కాతా రామచంద్రారెడ్డి తెలిపారు. విజేతలకు వరుసగా రూ. 40 వేలు, రూ.30 వేలు, రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ. 6 వేలు నగదు అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా బహుమతి రాని ప్రతి కాడికి రూ.2,000 నగదును అందజేస్తామని చెప్పారు. అదేరోజున గుర్రం పందెములు నిర్వహిస్తున్నామని, విజేతలకు వరుసగా 25 తులాల వెండి, 20 తులాల వెండి, 15 తులాల వెండి, 10 తులాల వెండి, 5 తులాల వెండి బహుమతిగా అందజేయనున్నట్లు తెలిపారు.

గడెపు ఎద్దుల పందెములు

మే 2న కాడెద్దుల పందెములు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విజేతలకు వరుసగా రూ. 10 వేలు, రూ. 7 వేలు, రూ. 5 వేలు, రూ. 3 వేలు అందజేస్తామని వెల్లడించారు.

ప్రతి కూలీకి రూ. 272 వేతనం అందాలి



మాట్లాడుతున్న ఏపీడీ బాలాజీ నాయక్

బండిఆత్మకూరు: ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు ప్రతి రోజూ రూ. 272 వేతనం అందేలా కొలతలు వేయాలని ఏపీడీ బాలాజీ నాయక్ ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ తప్పనిసరిగా కూలీల వేతనం బ్యాంకు ఖాతాల్లో పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి సంబంధించి బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్, మొబైల్ నంబరు మ్యాపింగ్ చేయాలన్నారు. అలా కాని పక్షంలో పోస్టల్ అకౌంట్ చేయించాలని సూచించారు. 5 ఎకరాలలోపు ఉన్న రైతులకు పండ్ల తోటలు పెంచుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో వాసుదేవ గుప్తా, ఏపీడీవో వసుధారెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నందికొట్కూరు: నాటు సారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని టౌన్ సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని నీలిషికారిపేటలో దాడులు నిర్వహించి 600 లీటర్ల బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. అలాగే నీలిషికారి సోని, శివాజీలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. సీఐ మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా నాటు సారా తయారు చేసి విక్రయిస్తే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామన్నారు.

బిల్లు లేకుండా విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నందికొట్కూరు: పత్తి, మొక్కజొన్న, మిరప, ఇతర విత్తనాలను బిల్లు లేకుండా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ విజయశేఖర్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఆత్మ భవనంలో డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీలకే రైతుకు విత్తనాలను విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణి, టెక్నికల్ అసిస్టెంట్ కలీమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

జూపాడుబంగ్లా: వచ్చే ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే పంటలకు అవసరమైన విత్తనాలు నాణ్యతగా ఉండేలా చూసుకోవాలని డీఆర్సీ బీటీఎం ఉమామహేశ్వరి, ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని తంగడంచ, తరిగోపుల గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు.

'బీజేపీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించండి'

ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, సీపీఐ కార్యవర్గ సభ్యుడు రామాంజినేయులు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని గౌడ్‌సెంటర్‌లో ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై అనేక భారాలు వేస్తోందన్నారు. లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం దురదృష్టకరమన్నారు. విశాఖ ఉక్కుపరిశ్రమను ప్రైవేటీకరణ చేయాలని చూడడం బీజేపీ కి తగదని చెప్పారు. నాయకులు రాజశేఖర్ రంగనాయుడు, రణధీర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సబ్సిడీని సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఆర్‌బీకేల ద్వారా సబ్సిడీపై అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.ఆంజనేయ సూచించారు. సీహెచ్‌సీ గ్రూప్ రైతులతో మంగళవారం మండలంలోని కొక్కెరంచ ఆర్‌బీకేలో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో 11 ఆర్‌బీకే సెంటర్లలో గ్రామ పంచాయతీకి ఒక కస్టమర్ హయరింగ్ సెంటర్ గ్రూప్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందులో 10 గ్రామపంచాయతీలలో గ్రూపుల ఏర్పాటు పూర్తయ్యిందన్నారు. మిగతా వాటిని కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ గ్రూప్‌లో ఉన్న రైతులకు ప్రభుత్వం ట్రాక్టర్లు, రోటవేటర్లు, పిచికారీ పంపులు, ఇతరత్ర సామగ్రిని సబ్సిడీతో అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకటనారాయణ, హార్టికల్చర్ సహాయకుడు ఆశోక్ కుమార్, సీహెచ్‌సీ గ్రూప్ కన్వీనర్ పాల్గొన్నారు.



సీహెచ్‌సీ సభ్యులతో మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

కొలతల ప్రకారం పని చేయాలి

పాములపాడు: టెక్నికల్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం కూలీలు పనులు చేయాలని ఏపీడీ అన్వరా బేగం సూచించారు. మంగళవారం మండలంలోని బానకచెర్ల, బానుముక్కల గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. హాజరుపట్టీని, మస్టర్లను పరిశీలించారు. పనులకు వచ్చిన కూలీల హాజరును ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా సక్రమంగా పంపుతున్నారా అని అడుగుతూ పరిశీలించారు. మస్టర్‌లో ఉన్న కూలీల పేర్లను చదివి హాజరువేశారు. పని ప్రారంభించిన వెంటనే ఒకసారి, 4 గంటల తర్వాత 2వ ఫోటోను తీయాలని సూచించారు. ఆమె వెంట ఏపీఓ విమలమ్మ, జేఈ రమేష్‌నాయుడు, సీటీఏ స్వాములు, ఎఫ్ఏలు సంజన్న, గోవిందు ఉన్నారు.



బానకచెర్ల గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ అన్వరాబేగం

మెగా పీపుల్ సర్వేకు ప్రజల ఆదరణ

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- ఇంటింటికీ జగనన్నే మా భవిష్యత్తు
- నియోజకవర్గంలో 69 శాతం సర్వే పూర్తి

నందికొట్కూరు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా చేపట్టిన పీపుల్ సర్వేలో మహిళల నుంచి ఊహించిన దానికన్నా బ్రహ్మాండమైన స్పందన లభిస్తోందని చెప్పారు. నియోజకవర్గంలో మెగా పీపుల్ సర్వే చురుగ్గా సాగుతోందన్నారు. చిరు వ్యాపారులు రాణించేందుకు సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. జగనన్న కాలనీల ద్వారా మహిళల సొంతింటి కల సాకారమైందని గుర్తు చేశారు. పార్టీని ప్రజల్లో తీసుకెళ్లడంలో సఫలీకృతమవుతున్నామన్నారు. సర్వేలో ఐదు ప్రశ్నలకు ప్రజలు సానుకూలంగా స్పందించి జగనన్నే మా భవిష్యత్తు అని చెబుతున్నారని చెప్పారు. 15 రోజుల్లో నియోజకవర్గంలో 69 శాతం సర్వే పూర్తయ్యిందని తెలిపారు. ఈ నెల 29వ తేదీ వరకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. సమావేశంలో ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి, సింగిల్ విండో చైర్మన్లు మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి, హుసేనయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు జాకీర్ హుసేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మహేష్, వెంకటేష్, బూషిగౌడ్, చిట్టిరెడ్డి, వెంకటస్వామి, రమణారెడ్డిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్థర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మహానంది: ఆటో, బైక్ ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలైన సంఘటన నందిపల్లె మెట్ట వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. రుద్రవరం మండలం ఎల్లావత్తుల గ్రామానికి చెందిన ఎల్లావత్తుల రాజు, చెన్నయ్య స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా గాజులపల్లె వైపు వెళ్తున్న ఆటో ఢీకొంది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108లో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. రాజుకు తీవ్రగాయాలు కావడంతో కర్నూలుకు వైద్యులు రెఫర్ చేశారు. ఎస్ఐ నాగేంద్రప్రసాద్ సిబ్బందిని పంపించి వివరాలు సేకరించారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు: మలేరియా జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. బైర్లూటి గూడెంలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు జ్వరాలు సోకిన వెంటనే రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రక్తనమూనా ద్వారా మలేరియాను గుర్తించవచ్చన్నారు. మలేరియా జ్వరాలను తగ్గించేందుకు వైద్యశాలల్లో అన్ని మందులు, వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామాల్లో ప్రతి బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, దోమతెరలు తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. అనంతరం గిరిజనులకు మలేరియా జ్వరాలపై అవగాహన కల్పించారు.

మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దాం

కొత్తపల్లి: మలేరియా రహిత సమాజాన్ని నిర్మించుకునేందుకు ప్రజలు సహకారం అందించాలని, గ్రామాలలోని ప్రతిఒక్కరూ పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని వైద్యులు వినోద్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బాలకృష్ణ, వైద్య,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



బైర్లూటిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

మిడుతూరు: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మద్దిలేటి సూచించారు. మంగళవారం మండలపరిధిలోని తలముడిపి ఆరోగ్య కేంద్రం నుంచి మలేరియా దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ సుబ్బారెడ్డి, పీహెచ్ఎన్ విలాసకుమారి, ఎంపీహెచ్ఎస్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఇళ్లు నిర్మిస్తాం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- లింగాలగట్టులో గడప గడపకు మన ప్రభుత్వం

శ్రీశైలంప్రాజెక్ట్: లింగాలగట్టులో నివసిస్తున్న మత్స్యకారులకు పక్కాగృహాలను నిర్మిస్తామని శ్రీశైలం శాసన సభ్యులు శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం లింగాలగట్టులోని వైజాగ్ క్యాంప్, బోయక్యాంప్ లను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి వారికి అందిన అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. లింగాలగట్టు గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సుమారు రూ.11 లక్షలతో చేపట్టాల్సిన త్రాగునీటి పైప్‌లైన్ నిర్మాణం ప్రారంభం కాలేదని, మహిళలకు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నా.. మరమ్మతులు చేపట్టాలన్నా.. అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని, మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించి నిర్మాణం చేపడతామని, అటవీఅధికారులతో మాట్లాడి అభ్యంతరాలు లేకుండా చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సాధారణసంక్షేమ పథకాలేకాకుండా మత్స్యకారులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు కూడ అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ రాజేంద్రసింగ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టివెంకటరెడ్డి, బీసీ సెల్ కార్యదర్శి జింకా గుండయ్య యాదవ్, నాయకులు భరత్‌రెడ్డి, ఆసాది ప్రవీణ్ దివ్యతేజ, కొండబాబు, మల్లికార్జున, సోమేష్, జగ్గారావు, చెన్నయ్య, శ్రీను, బలరాం, నూకరాజు,కె.మల్లి, బాదరమ్మ, ప్రభావతి,కుమారి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వైఎస్సార్‌సీపీలోకి 30 కుటుంబాల చేరిక

శ్రీశైలంప్రాజెక్ట్: లింగాలగట్టు గ్రామానికి చెందిన 30 కుటుంబాలు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. గడప గడపకు మన ప్రభుత్వం పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మంగళవారం లింగాలగట్టులో గడిపారు. బోయక్యాంప్‌లో తెలుగుదేశం, జనసేనపార్టీలకు చెందిన 30 కుటుంబాలకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆ ప్రాంత నాయకుడు చెన్నయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే శిల్పా చేస్తున్న అభివృద్ధి పనులను చూసి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు.



మత్స్యకారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే

మెరుగైన సేవలు అందించండి

మిడుతూరు: గ్రామ సచివాలయల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి జనార్దన్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం మిడుతూరు–1, 2 సచివాలయాలను తనిఖీ చేశారు. సంక్షేమ పథకాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా 540 సేవలు ఉన్నాయని, అందులో 60 సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సేవలు పెంచడం ద్వారా సచివాలయాలకు ఆదనంగా ఆదాయం వస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమలులో సాంకేతిక, ఇతర సమస్యలు వస్తే వాటి పరిష్కరించడంతో పాటు సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. సచివాలయ పరిధిలోనే స్పందన కార్యక్రమం నిర్వహించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఏన్‌ఎస్‌రెడ్డి, ఎస్‌బీసీసీ కో–ఆర్డినేటర్ విజయ్, పంచాయతీ కార్యదర్శులు సుధీర్ నందకుమార్, వినోద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ జనార్దన్‌రెడ్డి

కోనేటి కాల్వల మరమ్మతుకు ప్రతిపాదనలు

మహానంది: మహానంది దేవస్థానం పరిధిలోని కోనేటి కాల్వల మరమ్మతుల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చైర్మన్ కొమ్మా పాల మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహానంది కోనేరుల నుంచి బయటికి ప్రవహించే కోనేటి కాల్వలను మంగళవారం పరిశీలించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ దేవస్థానానికి చెందిన భూములతో పాటు రైతులు సాగు చేస్తున్న పంట పొలాలకు నీళ్లు వెళ్తాయన్నారు. అయితే కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి పూడిపోయాయన్నారు. వీటి మరమ్మతులకు సుమారు రూ. పది నుంచి రూ.20లక్షల వరకు ఖర్చు అవుతుందని, అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ విభాగం సిబ్బందికి సూచించారు. కాల్వలు మరమ్మతులు చేస్తే వేలాది ఎకరాల పంటలకు సాగునీరు పుష్కలంగా అందుతుందని చెప్పారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్, మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, భూమా సుబ్బరామయ్యలతో వివిధ అంశాలపై చర్చించారు.



పనులపై చర్చిస్తున్న చైర్మన్,ఈఓ, ధర్మకర్తలు

ఆదిశంకరాచార్యుల జయంతి

మహానంది: ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా మహానంది దేవస్థానంలో మంగళవారం సాయంత్రం ప్రదోష కాలంలో పూజలు నిర్వహించారు. వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో స్థానిక అలంకార మండపంలో ఆదిశంకరాచార్యుల వారి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. సనాతన హిందూ ధర్మం కోసం ఎంతో కృషి చేసిన ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు జనార్దనశర్మ, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

పరిచారకుడి ఆత్మహత్యాయత్నం

మహానంది: చార్జిమెమో జారీ చేశారన్న కారణంతో మహానంది ఆలయంలో విధులు నిర్వహిస్తున్న పరిచారకుడు హరికుమారశర్మ దంపతులు మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం చర్చనీయాంశమైంది. ఇటీవల అయ్యన్ననగర్ గ్రామానికి చెందిన సుధాకరయ్య ఈ నెల 14న రెండు చీరలను ఇవ్వగా, వారం దాటినా రసీదుల్లో పొందుపరచకపోవడంపై ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి వివరణ కోరుతూ నలుగురికి మెమోలు జారీ చేసిన విషయం తెలిసిందే. మెమోలు అందుకున్న హరికుమారశర్మ వాస్మోల్ తాగేందుకు యత్నించగా బంధుమిత్రులు అడ్డుకొని వారించారు. సమాచారం అందుకున్న ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ధర్మకర్త మల్లికార్జున, ఏఈఓ వై.మధు, వేదపండితులు ఆయన ఇంటికి వెళ్లి చర్చించారు. మెమోలు జారీ చేస్తే తగిన వివరణతో సంజాయిషీ ఇచ్చుకోవాలని, ఇలాంటి ఘటనలకు పాల్పడటం ఎంత మాత్రం సబబు కాదన్నారు. విధులకు హాజరు కావాలని అధికారులు ఆదేశించారు.

లబ్ధిదారుల ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో లబ్ధిదారుల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని కౌన్సిలర్ షేక్ అబ్దుల్ హామీద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 20 వార్డులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్ల కాలంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు దేశం పాలనలో పథకాలు మంజూరు కావాలంటే లంచం ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరి సిఫారసు లేకుండానే ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించిందని చెప్పారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

జూపాడుబంగ్లా: వచ్చే ఎన్నికల్లో మరోసారి జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి సీఎంగా గెలిపించాలని మండల ఉపాధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి కోరారు. మండలంలోని మండ్లెం గ్రామంలో మంగళవారం 'జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆనంద్ రజక, కాంట్రాక్టర్ సురేంద్రారెడ్డి, భరత్‌రెడ్డి, మెట్లరామసుబ్బారెడ్డి, చిన్నమద్దిలేటి, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థి మృతిపై విచారణ



విద్యార్థులను విచారిస్తున్న త్రిసభ్య కమిటీ సభ్యులు

జూపాడుబంగ్లా: స్థానిక గురుకుల పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఎం నగేష్ మృతిపై మంగళవారం త్రిసభ్య కమిటీ సభ్యులు ఆత్మకూరు ఆర్డీఓ ఎం దాసు, గురుకుల పాఠశాలల డీసీఓ శ్రీదేవి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ చింతామణి విచారణ చేపట్టారు. మృతుడి స్నేహితులు, అతనితో పాటు బావిలో ఈతకు వెళ్లిన విద్యార్థులను విచారించారు. ఇప్పటికే సస్పెండ్ అయిన ప్రిన్సిపాల్ రాజు, హౌస్‌మాస్టర్ ఏసేపు, సెక్యూరిటీ గార్డులను విచారించి సమగ్ర నివేదికలను తయారుచేసినట్లు తెలిపారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ విచారణలో వెల్లడైన విషయాలను సమగ్రంగా త్రిసభ్య కమిటీ అధ్వర్యంలో జిల్లా కలెక్టర్ మనజీర్‌జిలానీ శ్యామూన్‌కు నివేదిచనున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీల మేరకు మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చేస్తామని, పాఠశాలలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ మంజులవాణి, ఈఓపీఆర్డీ మణిమంజరి, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ తహసీల్దార్ నాగన్న పాల్గొన్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు, సీపీఐ నాయకుడు రమేష్‌బాబు, విద్యార్థి సంఘం నాయకుడు శ్రీనివాసులు త్రిసభ్య కమిటీ సభ్యులను కోరారు.

మైనార్టీలు అండగా నిలవాలి

పగిడ్యాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మైనార్టీలు అండగా నిలవాలని ఆ పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా మైనార్టీల రీజనల్ కో ఆర్డినేటర్ అబుబక్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి గృహంలో మైనార్టీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలను ఆర్థికంగా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. నవరత్నాల పథకం ద్వారా అనేక సంక్షేమ పథకాలను పారదర్శకంగా అర్హులకు అందజేస్తున్నది ఒక్క జగనన్న ప్రభుత్వమేనని వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోని అన్ని రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలువబోతుందని, అందుకు మైనార్టీలు సంఘటితంగా ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, మైనార్టీ నాయకులు ఉస్మాన్‌బాషా, మహబూబ్‌బాషా, మహ్మద్‌రఫీ, వజీర్‌బాషా, సలీం, సుల్తాన్, ఇబ్రహీం, మస్తాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అబుబక్కర్